క్లుప్తంగా

ఉత్సాహంగా క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న బాలికలు

బిక్కవోలు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద బాలికల స్కూల్ గేమ్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 బాలికల విభాగంలో త్రోబాల్, టెన్నికాయిట్‌తో పాటు, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వీటిల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు అనపర్తి జోనల్ స్థాయిలో ఎంపిక చేసినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ మానుకొండ ధనరాజ్ తెలిపారు. ఈ పోటీల్లో బిక్కవోలు, పందలపాక, మెళ్లూరు, ఈలపల్లి, కాపవరం నుంచి సుమారు 72 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సోమవారం నుంచి బాలుర విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. పాఠశాల హెచ్ఎం పి.ప్రభాకర్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైవర్ శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన కెల్లా శ్రీనివాస్ కుటుంబానికి రూ.2,45,050 ఆర్థిక సాయాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు శుక్రవారం అందజేశారు. ఈ సొమ్ములో రూ.2,30,500లను ఇద్దరు పిల్లల పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి, మిగిలిన సొమ్మును అతడి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమానికి సహృదయంతో సహకరించిన యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాస్యత దినోత్సవం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రముఖులు

రాజానగరం: దివాన్‌చెరువులోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహించారు. వీజేస్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అక్షర జ్ఞానం వలన కలిగే ప్రయోజనాలు, లేకుంటే ఎదురయ్యే సమస్యలపై ప్రిన్సిపాల్ డి.నరేంద్ర, కరస్పాండెంట్ ఎన్‌వీవీ జగన్మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఎస్.శకుంతల, హెచ్ఎం సునీత తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

రంగంపేట: అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు, అమ్మకాలు జరుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఎస్టీరాజాపురం ఆర్ఎస్ వెంచర్స్‌లో అదే గ్రామానికి చెందిన నంద్యాల రమేష్ పీడీఎస్ బియ్యం కొనుగోలు, అమ్మకాలు జరుపుతున్నట్టు సమాచారం అందడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎన్.రమేష్, ఎంఎస్ఓ ఎం.కమల్ సుందర్‌లు దాడి చేశారు. నిందితుని వద్ద 1,440 కిలోల పీడీఎస్ బియ్యం, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని తమకు ఫిర్యాదు ఇవ్వడంతో 420 కేసు నమోదు చేశామని ఎస్సై రామకృష్ణ చెప్పారు.

కోటపాడులో చోరీ

కోటపాడులో కందర్ప వెంకట సత్యసాయి తన పెద్ద కుమారుడి వివాహం కారణంగా 7న ఇంటికి తాళం వేసి రామచంద్రపురం వెళ్లారు. అదేరోజు రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులకొట్టి ఇంటిలోకి చొరబడి బీరువాలోని రూ.లక్ష నగదు, 20 గ్రాముల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి సామగ్రి చోరీ చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు.

సారా కేసులో ఇద్దరి అరెస్ట్

సారా కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. రంగంపేటలో సిబ్బందితో తనిఖీలు చేయగా పంపన లక్ష్మి పది లీటర్ల సారాతో పట్టుబడిందన్నారు. ఆమెకు దెయ్యాల నూకరాజు సారా సరఫరా చేసినట్టు తెలపడంతో అతన్ని కూడా అదుపులోకి తీసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

వరకట్నం వేధింపులపై ఫిర్యాదు

బిక్కవోలు: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని రంగాపురానికి చెందిన తగ్గెళ్ల దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. రంగాపురానికి తన భర్త దుర్గాప్రసాద్‌తో పాటు కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, 7న రాత్రి దాడి చేయడంతో ఆసుపత్రి చికిత్స పొందుతున్నట్లు ఆమె పేర్కొంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జగన్ పాలనలో పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కోటికేశవరంలో గడప గడపకూ..



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే రాష్ట్రంలో పేద, బడుగు వర్గాల సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఎస్సీ, బీసీ పేటల్లో గడప గడపకూ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. స్థానికులు తెలిపిన తాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కోటికేశవరంలో మౌలిక వసతుల కల్పనతో పాటు, వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. సాయంత్రం 4 నుంచి రాత్రి పది గంటల వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 300 గడపలు తిరిగారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ముడే సింధూదివ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేశుల పోసి, పార్టీ సీనియర్ నాయకులు ములగాడ ఫణికుమార్, ఎంపీటీసీ సభ్యులు నేతల బుజ్జి, కోటికేశవరం మాజీ సర్పంచ్ ముంద్రు శ్రీరామ్మూర్తి, నాయకులు దేవరపల్లి బోసు, నల్లమాటి బలరామ్, మన్నే సతీష్, జల్లూరి పైడియ్య, ఉప సర్పంచ్ కె.గంగరాజు, ముడే కామేష్ పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్త సతీష్‌కు సన్మానం



శాస్త్రవేత్త సతీష్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

సీతానగరం: చంద్రయాన్–3 టీమ్‌లో సభ్యుడైన రఘుదేవపురానికి చెందిన ఇస్రో శాస్త్రవేత్త మామిడి సతీష్‌ను శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దొరబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రఘుదేవపురానికి చెందిన మామిడి మంగారావు, రత్నం దంపతుల కుమారుడైన సతీష్ సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1998 – 2000 ఏడాది ఇంటర్మీడియట్ చదివారు. బెంగళూరులో ఎనిమిదేళ్లుగా ఇస్రో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. చంద్రయాన్–3 విజయవంతంగా చంద్రునిపై కాలుమోపిన సమయంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్‌తో ఉన్న సతీష్ ఫొటో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఈ నేపథ్యంలో సతీష్‌ను సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ దొరబాబు, లెక్చరర్లు ఏఎస్ శేఖర్ బాబు, పీవీవీఎస్ఎన్ శర్మ, శ్రీనివాసరావు, దొండమూడి కోటేశ్వరరావు, యు.సురేష్ బాబు, యు.మనోజ్ బాబు, లైబ్రేరియన్ పి.చిన్నారావు తదితరులు ఘనంగా సన్మానించారు.

అక్షరాస్యతతోనే అన్నింటా ఉన్నతి



కొంకుదురులో తెరచిన పుస్తకం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

బిక్కవోలు: అక్షరాస్యతతోనే అన్నింటా ఉన్నతి సాధించవచ్చని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు తెరచిన పుస్తకం ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాలు నిరక్షరాస్యత నిర్మూలనకు పాటుపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీ కృష్ణసాయి, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మణరెడ్డి, వలీషా తదితరులు పాల్గొన్నారు.

ఈ–స్టాంపింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ సులభతరం

అనపర్తి: రిజిస్ట్రేషన్ శాఖలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన ఈ–స్టాంపింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భూముల క్రయ, విక్రయాల్లో వినియోగదారులు ఎటువంటి స్టాంప్ పేపర్లు తమ వెంట తీసుకువెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఈ–స్టాంపింగ్ విధానంలో ఆన్‌లైన్‌లో స్లాట్ ప్రకారం నిర్ణీత సమయానికి క్రయ, విక్రయదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే ఈ–సిగ్నేచర్ ద్వారా ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. నాన్–జ్యుడీషియల్ స్టాంపు పత్రాల స్థానంలో ఈ–స్టాంపింగ్ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకు వచ్చిందని, దీని ద్వారా వినియోగదారులు కేవలం 20 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ–స్టాంపింగ్‌కు ఎక్కువ భద్రత ఉంటుందని, అయితే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన లేని కొందరు దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో పాటు, దస్తావేజుల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చని, ఈ–స్టాంపింగ్‌పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే తెలిపారు.

వీణాపాణీ నమోస్తుతే..



వీణాపాణిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

అనపర్తి: స్థానిక కాంతిపురంలో వేంచేసిఉన్న గణపతి, సరస్వతి సమేత మహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం వీణాపాణిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సామూహిక కుంకుమ పూజలు చేశారు. అదేవిధంగా అమ్మవారిని విద్యార్థులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

15 నుంచి జగనన్న 'ఆరోగ్య సురక్ష'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మాజ్యోతి

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె.పద్మజ్యోతి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తారన్నారు. ఈ సర్వేకు అన్నిశాఖల అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.గౌరమ్మ, కార్యదర్శులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



సంపరలో విజయదుర్గమ్మకు పూజలు చేస్తున్న అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు

పెదపూడి: సంపరలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గమ్మ వారి ఆలయంలో శ్రావణమాసం నాల్గో శుక్రవారం సందర్భంగా కుంకుమ పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు సామూహిక కుంకుమ పూజలను చేయించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా మహా కుంభాభిషేకం



కొమరిపాలెంలో అమ్మవారికి గోదావరి జలాలు తీసుకు వస్తున్న భక్తులు

బిక్కవోలు: కొమరిపాలెంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద మహా కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసం నాల్గో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ పూజలను ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సత్యనారాయణరెడ్డి దంపతులు ప్రారంభించారు. సుమారు 15 వేల మంది భక్తులు గోదావరి జలాలను తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. బలభద్రపురం గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకటరెడ్డి, వెంకాయమ్మ దంపతులు, కొవ్వూరి సతీష్‌రెడ్డి, శ్రీదేవి దంపతుల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జామి విశ్వేశ్వరరావు, కమిటీ సభ్యులు సహకారం అందించారు.

అటవీ సిబ్బంది తనిఖీలు

సీతానగరం: అటవీశాఖ డీఆర్‌వో టి.రాజా ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, రాజబాబు, మోహనరావు తదతరులు శుక్రవారం సీతానగరం వెలమపేట కార్ఖానాలోని కలపను తనిఖీ చేశారు. బిల్లుల ప్రకారం కలప ఉందా అనే విషయాన్ని ఆరా తీశారు. అక్కడి నుంచి స్థానిక సామిల్లు వద్దకు వెళ్లి రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఆర్‌వో రాజా విలేకరులతో మాట్లాడుతూ రెండు చోట్లా రికార్డుల ప్రకారం కలప ఉందని తెలిపారు.

దేవీచౌక్ ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసంలోని చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాసశర్మ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మను వెండి, బంగారు ఆభరణాలతో వరలక్ష్మీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఓటరు జాబితాపై సమీక్ష

మధురపూడి: కోరుకొండ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో చైత్రవర్షిణి శుక్రవారం ఓటరు జాబితా సర్వేపై సమీక్షించారు. ఇటీవల ఇంటింటికీ నిర్వహించిన సర్వే వివరాలపై ఆరా తీశారు. తహసీల్దార్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ చాలీసా పారాయణ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పక్కనే ఉన్న దత్త ఆశ్రమంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ జరగనుంది. రాజమహేంద్రవరానికి చెందిన ఎస్‌జీఎస్ భజనామృత సత్సంగం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆసక్తి ఉన్న వారందరూ పాల్గొనవచ్చన్నారు. పారాయణ అనంతరం ప్రసాద వితరణ జరుగుతుంది.

ర్యాగింగ్‌తో అనేక అనర్థాలు

రాజానగరం: జూనియర్లకు సీనియర్లు ఆదర్శంగా నిలవాలని, ర్యాగింగ్ పేరుతో వారిపై వికృతమైన చేష్టలకు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని రాజమహేంద్రవరం ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.రెడ్డి ప్రసన్న అన్నారు. దివాన్‌చెరువులోని వీజీఎస్ ఫార్మసీ కాలేజీలో శుక్రవారం ర్యాగింగ్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు, శ్రీవాత్సవ్, లక్ష్మీ మౌనిక, ప్రభుత్వ వైద్యులు ఎస్.అఖిల, బొమ్మూరు ఎస్సై జగన్మోహనరావు, కాలేజీ కరస్పాండెంట్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేంద్ర పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాలులో శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజా తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఉపాధ్యాయులకు పాదాభివందనం చేశారు. ఎమ్మెల్యేరాజా మాట్లాడుతూ ఉపాధ్యాయులను జగనన్న ప్రభుత్వం గౌరవిస్తోందన్నారు. విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అధికంగా నిధులు కేటాయిస్తోందన్నారు. రాష్ట్ర స్థాయిలో పిట్టా శిరీష, జిల్లా స్థాయిలో డి.విజయమణి, ఏ.అర్జునరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం సంతోషకరమన్నారు. అలాగే మండల స్థాయిలో సీహెచ్ సరళ కుమారి, కె.నాగేశ్వరరావు, వీకే సుధాకర్, కేసీహెచ్ జాకబ్ రాజు తదితర ఏడుగురు ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ గణేశుల పోసి, ఎంఈఓలు టి.కుశలవ దొర, ఎం.సుజాత, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పల్లా రాజారావు, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు గింజాల శివబాబు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రంగాపురంలో ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- రంగాపురంలో గడప గడపకూ..
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం రంగాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి తెలియజేసి, దీనికి సంబంధించిన బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను వలంటీర్ల ద్వారా అందజేస్తున్నారన్నారు. పేదల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రికి అంతా అండగా నిలవాలని కోరారు. సర్పంచ్ గండికోట వీరభద్రరావు, నాయకులు కనుమూరి సాయిరాజు, పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, ఇలపల్లి సర్పంచ్ లోల్లం భద్రం, ఎంపీటీసీ కేతా ఏసురత్నం, ఉప సర్పంచ్ శాంతికుమారి పాల్గొన్నారు.

నేడే గడప గడపకూ..

రంగాపురంలో రెండో రోజు శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని సర్పంచ్ గండికోట వీరభద్రరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

సీఎం జగన్‌తో పారదర్శక పాలన



సంపరలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ముక్తేశ్వరరావు

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు పారదర్శక పాలన అందుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు అన్నారు. శుక్రవారం సంపరలో కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం పింఛన్లు పంపిణీ చేశారు. సర్పంచ్ అద్దంకి మాచరమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రమూర్తి, ఉప సర్పంచ్ అద్దంకి సత్యవేణి, నాయకులు అద్దంకి భద్రం, అద్దంకి బాబులు పాల్గొన్నారు.

అన్నదాతల అభ్యున్నతికి కృషి



ఆర్బీకే మండల చైర్మన్ వెంకట్రాజును సన్మానిస్తున్న దృశ్యం

సీతానగరం: ప్రతి రైతూ వ్యవసాయపరంగా లబ్ధి పొందేలా కృషి చేస్తామని మండల రైతు భరోసా కేంద్రాల చైర్మన్ వలవల వెంకట్రాజు (తోటలో రాజు) తెలిపారు. శుక్రవారం సీతానగరం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఆత్మ చైర్మన్ పెదపాటి డాక్టర్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల ఆర్బీకే చైర్మన్‌గా వెంకట్రాజుతో ఏడీఈ మల్లికార్జునరావు ప్రమాణ స్వీకారం చేయించారు. వెంకట్రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి, రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏవో కె.సూర్యరమేష్, ఏఈవో శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వసంతరావు, నాయకులు చల్లమళ్ల సుజీరాజు, చిలువూరి మధుసూదనరావు, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, కోల శ్రీను పాల్గొన్నారు.